సాక్షి
విజయనగరం
మంగళవారం ; 3 ; జూన్ ; 2025





ప్రజల సమస్యలను పరిష్కరించాలి

ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

- IIలో



అల్లంత దూరాన..!

- IIలో

సాలూరు మండలంలోని దిగువ మెండంగి డిపోలో రేషన్ సరుకుల కోసం డొంకల వెలగవలస, పనసలవలస తదితర గ్రామాల ప్రజలు సోమవారం ఆటోలో వచ్చి సరుకులు తీసుకున్నారు.

న్యూస్‌రీల్

చింతపల్లి బీచ్‌ను పరిశీలించిన జేసీ



చింతపల్లి బీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో ఈ నెల 6న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీచ్‌ను జేసీ సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. వేదిక, యోగా ప్రదర్శన స్థలాన్ని గుర్తించారు. ఆయన వెంట తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం. రాధిక, తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న మడ్డువలస నీటిమట్టం



ప్రాజెక్టు వద్ద నీటినిల్వ

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి ప్రాజెక్టులోకి వచ్చే నీటి ప్రవాహం పెరిగింది. సుమారు వెయ్యి క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో 64.05 మీటర్ల మేర నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

మెస్ బిల్లులు పెంచండి

- డీఆర్వోకు ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: సంక్షేమ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు అందజేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. విజయనగరం డీఆర్వో శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. హాస్టళ్లకు సొంత భవనాల నిర్మాణంతో పాటు వార్డెన్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు ఎ.సుమన్, గణేష్ పాల్గొన్నారు.

రేషన్ తిప్పలు

నిత్యావసర సరుకులను గత ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసేది. ఎలాంటి ఇబ్బందులూ ఉండేవికావు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాహనాలను (ఎండీయూ వ్యవస్థ) నిలుపుదల చేయడంతో డిపోలకు వెళ్లి రేషన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. నివాసాలకు రేషన్ డిపోలు దూరంగా ఉండడంతో పనులు మానుకుని, చిన్నారులను వెంటబెట్టుకుని నడిచి వెళ్తున్నారు. రెండోరోజు సోమవారం చాలాచోట్ల నెట్‌వర్క్ సమస్యలతో రేషన్ పంపిణీలో జాప్యం జరగడంతో డిపోల వద్ద పడిగాపులు కాశారు. దీనికి ఈ చిత్రాలే సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



భగవాన్ నగర్‌లో రేషన్ సరుకుల కోసం చిన్నారులతో డిపోకు వచ్చిన మహిళ



సర్వర్ పనిచేయకపోవడంతో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

స్టేడియం కాలనీలో తలపై బియ్యంమూటతో ముందుకు సాగుతున్న మహిళ



బియ్యం కోసం వేచి ఉన్న చిన్నారులు, మహిళలు



బియ్యం కావాలంటే క్యూ కట్టాల్సిందే...

ఇదెక్కడి రాజ్యాంగం..!

- దేవదాయ శాఖాధికారుల సూచనల మేరకు ఆక్రమణలు తొలగించిన జేసీబీ డ్రైవర్
- జేసీబీని సీజ్ చేసిన పోలీసులు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు చెందిన జేసీబీ కావడంతోనే వేధింపులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న జేసీబీ డ్రైవర్ బంధువులు



మే 26న దేవదాయశాఖకు చెందిన ఆరుగురు ఈఓలు బృందం ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు ఇలా..(ఫైల్)



చీపురుపల్లి పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో జేసీబీ యంత్రం

చీపురుపల్లి:

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఏ విధంగా అమలవుతుందనేందుకు చీపురుపల్లిలో వెలుగుచూసిన ఘటనే నిలువెత్తు నిదర్శనం. సాక్షాత్తూ దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఆరుగురు ఈఓలతో కూడిన అధికారుల బృందం ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు జరిగితే... పోలీసులు జేసీబీని సీజ్‌చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతో విలువైన దేవదాయ భూముల్లో ఆక్రమణలు పక్కన పెట్టి సాక్షాత్తూ దేవదాయశాఖ బుక్ చేసుకున్న జేసీబీ యంత్రాన్ని పోలీసులు సీజ్ చేయడం వెనుక రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని స్థానికంగా చర్చ జరొందుకుంది. ఆ జేసీబీ యంత్రం వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తది కావడంతోనే సీజ్ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పట్టాభిరామస్వామి దేవస్థానం భూముల్లో ఆక్రమణల తొలగిస్తున్న అధికారులపై స్థానిక ఎమ్మెల్యే ఫైర్ అయినట్లు సమాచారం. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా ఆక్రమణలు ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పట్టాభిరామస్వామికి చెందిన భూముల్లో..

పట్టణంలోని చీపురుపల్లి–రాజాం రోడ్డులో ప్రధాన రహదారిని ఆనుకుని సర్వే నంబర్ 209/6లో పట్టాభిరామస్వామి దేవస్థానానికి చెందిన 1.53 ఎకరాల భూమి ఉంది. ఆ భూములను చాలా కాలం కిందటే ప్రస్తుత జనసేన నాయకుడు కొనుగోలు చేసి క్రయ, విక్రయాలు జరిపారు. అందులో స్థలాలు కొనుగోలు చేసిన కొంతమంది నిర్మాణాలు ప్రారంభిస్తే స్థానికుల ఫిర్యాదు మేరకు గత ప్రభుత్వంలోనే నిర్మాణాలు నిలిపివేశారు. ఇటీవల కొద్ది రోజుల కిందట వైఎస్సార్‌సీపీకి చెందిన కొంతమంది నాయకులు పట్టాభిరామస్వామి భూములను పరిరక్షించాలని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో ఆరుగురు అధికారుల బృందం ఈ ఏడాది మే 26న ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త జేసీబీ కావడమే ..

మే 26న పట్టాభిరామస్వామి దేవస్థానం భూముల్లో ఆక్రమణల తొలగింపునకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పుర్రేయవలస గ్రామానికి చెందిన కంది దుర్గారావుకు చెందిన జేసీబీ యంత్రాన్ని బుక్ చేసుకున్నారు. దీంతో అధికారుల సూచనల మేరకు జేసీబీ డ్రైవర్ దేవస్థానం భూముల్లో నిర్మాణంలో ఉన్న ఓ ఉపాధ్యాయుడి ఇంటికి చెందిన పిల్లర్లు కూల్చాడు. అదే రోజు దేవస్థానం అధికారులు జేసీబీ యజమానికి రూ.2,500 కూడా చెల్లించారు.

దేవదాయశాఖ చెప్పినా......జేసీబీ సీజ్

దేవదాయశాఖ అధికారులు బుక్ చేసుకున్నప్పటికీ ఓ ఉపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు జేసీబీ యంత్రాన్ని సీజ్ చేసి పోలీస్ క్వార్టర్స్‌లో ఉంచారు. తనకేం సంబంధం లేదని జేసీబీ యజమాని చెబుతున్నప్పటికీ పోలీసులు వినలేదు. అంతేకాకుండా సాక్షాత్తూ దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తామే జేసీబీని బుక్ చేశామని వాంగ్మూలం ఇచ్చినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం సర్వత్రా చర్చాంశనీయమవుతోంది.

నాలుగు రోజుల ముందే బందోబస్తు కోసం లేఖ..



ఆక్రమణల తొలగింపునకు పోలీస్ బందోబస్తు కావాలంటూ మే 22న పోలీసులను లిఖిత పూర్వకంగా కోరిన దేవదాయశాఖ ఈఓ

పట్టాభిరామస్వామి దేవస్థానం భూముల్లో ఆక్రమణల తొలగింపుల నిమిత్తం మే 22న దేవదాయశాఖ ఈఓ వై.శ్రీనివాసరావు పోలీసు బందోబస్తు కోరుతూ లిఖిత పూర్వకంగా చీపురుపల్లి డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను కోరారు. అదే రోజు చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో లెటర్ రిసీవ్ చేసుకున్నట్లు సంతకంతో కూడిన అకనాలెడ్జ్‌మెంట్ కాపీ కూడా దేవదాయశాఖ అధికారుల వద్ద ఉంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో..

విజయకేతనం

విజయనగరం అర్బన్:

ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాకి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో వెయ్యి లోపు ర్యాంకులు 9 మంది, ఓబీసీ కేటగిరీలో 20 మంది సాధించారు. ఓబీసీ కేటగిరిలో పి.హేమసాయి సూర్య కార్తీక్–4, బలగ జయేంద్రనాయుడు– 437, ఎస్సీ కేటగిరీలో కాట్రగడ్డ రాజ్ కిరణ్– 344 ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయి/ఓబీసీ ర్యాంకర్లలో తాలాబత్తుల మనోహర్ (116/15), పీటీ ఆనంద్ చక్రవర్తి (118/17), అరంగి శాత్విక్ (278/39), పొట్నూర్ కార్తీక్ (419), కేవీ అరవింద్ కుమార్ (442), దాసరి మహతి (551/79), బి.ఈశ్వరతనూజ్ (617/94), అప్పల శ్రీ హర్షవర్దన్ (635/99), తుమ్మగంటి వెంకట విష్ణుశ్రీవత్స (672/103), వెన్ను జయదీప్‌నాయుడు (1632/282) ఉన్నారు.



పి.హేమసాయి సూర్యకార్తీక్ (ఓబీసీ-4)



బలగ జయేంద్ర నాయుడుకు (ఓబీసీ- 437)



కాట్రగడ్డ రాజ్‌కిరణ్ (ఎస్సీ-344)



పొట్నూర్ కార్తీక్ (జనరల్-419)



కేవీ అరవింద్ కుమార్ (జనరల్- 442)



అరంగి సాత్విక్ (జనరల్-278)

- తునివాడ గ్రామానికి చెందిన పల్లి శాంతిప్రియ ఆలిండియా జాతీయస్థాయి/ ఓబీసీ కేటగిరీలో 1446/737 ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి వెంకటరమణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి కుమారి గృహిణి.



పల్లి శాంతిప్రియ

రేగిడి విద్యార్థుల సత్తా



మురపాక శ్రీనిధి

రేగిడి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రేగిడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కొమెర గ్రామానికి చెందిన మురపాక శ్రీనిధి ఓబీసీ కేటగిరీలో 2,561వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి తండ్రి మురపాక వెంకటరమణ ఇదే మండలం లక్ష్మీపురం పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా, తల్లి గౌరీశ్వరి గృహిణి.

బొబ్బిలి విద్యార్థుల ప్రతిభ



పీటీ ఆనంద్

బొబ్బిలి: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన పీటీ ఆనంద్ ఓపెన్ కేటగిరీలో 118, ఓబీసీలో 17వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడుకాగా, తల్లి అనూరాధ గృహిణి.

వంగర విద్యార్థి ప్రతిభ



కటికి బాలాజీ సిద్ధార్థ

వంగర: మండలంలోని బాగెంపేట గ్రామానికి చెందిన కటికి బాలాజీ సిద్ధార్థ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సీఆర్ఎల్–2,670, ఓబీసీ కేటగిరీలో 486 ర్యాంకు సాధించాడు. తండ్రి కటికి శివున్నాయుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి లలితకుమారి ఓ ప్రైవేటు పాఠశాల టీచర్.

ఆరికతోట విద్యార్థి ప్రతిభ



జాగాన యోగేశ్వర్

రామభద్రపురం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగేశ్వర్ జాతీయ స్థాయిలో ఓబీసీ కేటగిరీలో 40వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 284వ ర్యాంకు సాంధించాడు. విద్యార్థి తండ్రి సింహాచలం ఓ ప్రవేట్ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తుండగా, తల్లి యర్రయ్యమ్మ గృహిణి.

ఉచిత హామీలతో కూటమి వెన్నుపోటు

- ప్రజలను ఆశపెట్టి మోసగించిన కూటమి ప్రభుత్వం
- హామీలు అమలుచేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 4న 'వెన్నుపోటు దినం' నిర్వహణ
- అన్ని నియోజకవర్గాల్లో విజయవంతంగా నిర్వహించాలి
- పార్టీ కార్యక్రమాల నిర్వహణలో పార్టీ మండలాధ్యక్షులదే కీలక పాత్ర
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు
- పార్టీ మండల/నగర అధ్యక్షులతో సమీక్ష సమావేశం



ధర్మపురిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్

విజయనగరం: కూటమి నేతలు ఎన్నికలకు ముందు ప్రజలను హామీలతో ఆశపెట్టి మోసగించారని, చెప్పిన వాగ్దానాలను అమలు చేయని మోసకారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన వెన్నుపోటు దినంను అన్ని వర్గాల ప్రజలు సమన్వయంతో విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీన రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ నిరసన ప్రదర్శనలు సాగుతాయన్నారు. విజయనగరం జిల్లాలోని అన్ని శాసనసభా నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహించి అధికార యంత్రాంగానికి ఎన్నికల హామీల అమలుపై వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ధర్మపురి సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, పార్టీ మండల, నగరాధ్యక్షులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలే స్వచ్ఛందంగా భాగస్వాములై విజయవంతం చేస్తారన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వ వైఫల్యాలపై చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతినాయకుడు, కార్యకర్త ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు.

పార్టీ మండలాధ్యక్షులదే కీలక పాత్ర...

ప్రజల పక్షాన నిలబడే వైఎస్సార్‌సీపీ పునఃనిర్మాణంలో పార్టీ మండల, నగర అధ్యక్షులు కీలక భూమిక పోషించాలని మజ్జి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీను బలోపేతం చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే పార్టీ శ్రేణుల సూచనల మేరకు పాలన సాగిస్తామని అధినేత మాట ఇచ్చినట్లు చెప్పారు. ఇకపై నెలవారీ సమావేశంలో అధ్యక్షులంతా తమ సలహాలు, సూచనలు అందజేయాల్సి ఉంటుందన్నారు. అదే సందర్భంలో మీమీ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాటాలకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

కార్యకర్తలకు మంచి చేసే ఆలోచనలో జగన్‌మోహన్‌రెడ్డి: కిల్లి సత్యనారాయణ

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు మంచి చేసే ఆలోచనలో ఉన్నారని, పార్టీ కోసం కష్టించిపని చేసే వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటాయని వైఎస్సార్‌సీపీ విజయనగరం పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు కిల్లి సత్యనారాయణ చెప్పారు. అధికారంలోకి వస్తే పాలనలో మార్పు తీసుకువస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఏడాది వ్యవధిలో ఏ ప్రభుత్వంపై లేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. కేంద్రం నుంచి రూ.లక్షలకోట్ల అప్పులు తేవడం మినహా హామీల అమలుపై ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి లేదని తూర్పారబట్టారు. పార్టీ నుంచి వచ్చే ప్రతి ఆదేశాన్ని తూచాతప్పకుండా అమలు చేయడంలో మనమంతా సైనికుల్లా పనిచేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నర్సింహామూర్తి, ఇప్పిలి అనంత్, శంబంగి వేణుగోపాలనాయుడు, సంగంరెడ్డి బంగారునాయుడు, అల్లాడ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పార్టీ కమిటీల నియామకాలు..

పార్టీ ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీలు, జిల్లా అనుబంధ కమిటీలు, గ్రామ, వార్డుస్థాయి కమిటీలను నియమించే బాధ్యత పార్టీ మండలాధ్యక్షులదేనని మజ్జి శ్రీనివాసరావు స్పష్టంచేశారు. పార్టీ 26 జిల్లా అనుబంధ కమిటీల్లో చురుకైన వారికి స్థానం కల్పించాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అనుబంధ కమిటీల నియామకాలను పర్యవేక్షిస్తారని, వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అధిక సమయం క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలన్నారు.

నేనే.. జిల్లా బాస్..!

- నా అనుమతి లేనిదే ప్రజాప్రతినిధులను కలవొద్దు
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



జిల్లా అధికారిపై సీరియస్ అవుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: శాఖాపరమైన ఎలాంటి అభివృద్ధి పనులకైనా ప్రజాప్రతినిధులను ఆహ్వానించే ముందుకానీ, మీరు వారిని ఇంకే కారణంతోనైనా కలవాలన్నా విధిగా తన అనుమతి తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అయినా, ప్రజాప్రతినిధులైనా పిలిస్తే వెళ్లేముందు తన అనుమతి విధిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి తీసుకోకుండా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఇటీవల వ్యవహరించిన సమగ్ర శిక్ష ఏపీసీ, వ్యవసాయశాఖ జిల్లా అధికారులపై ఆగ్రహించారు.

జిల్లా బాస్‌ను నేనే.. నన్ను దాటి ఎవరైనా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను హింసిస్తుండడం వల్లే ఇటీవల పలువురు జిల్లా అధికారులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారని కొంతమంది జిల్లా అధికారులే చెప్పినట్లు డీఆర్‌ఓకు మంత్రి చెప్పారని, ఈ మేరకు ప్రచారం చేయడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో ఎవరికీ సెలవులు ఇవ్వనని, తన అనుమతి లేకుండా సెలవులు తీసుకున్న వారిపై వేటు తప్పదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఇంటిపైకి దూసుకెళ్లిన కారు..

• ముగ్గురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో ఇంటిపైకి దూసుకెళ్లిన కారు

విజయనగరం గంటస్తంభం/క్రైమ్: విజయనగరం సన్‌స్కూల్ పక్కన రామకృష్ణ నగర్‌లో నివాసముంటున్న పట్నాన సత్యవతి ఇంటిపైకి డంపింగ్ యార్డు మీదుగా 15 అడుగుల ఎత్తు నుంచి ఓ కారు దూసుకువచ్చింది. ఈ ఘటనలో పట్నాన సత్యవతి(60), గొడ్డు వినయ్(14), పట్నాన వినయ్(12) కారు కింద ఇరుక్కుపోయారు. దీంతో కాలనీ యువకులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని కారును ఎత్తి వారిని బయటకు తీశారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరావు, ఎం.శాంతమూర్తి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అర్ధరాత్రి మద్యం తాగుతూ కారును నడిపిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హైవోల్టేజ్‌తో కాలిపోయిన టీవీలు



కాలి బూడిదైన ఫ్యాన్లు, టీవీ, ఇతర వస్తువులు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని జొన్నగుడ్డి రుప్పవీధిలో హైవోల్టేజ్ రావడంతో సోమవారం ఓ ఇంట్లోని ఫ్యాన్లు, టీవీ, కూలర్, లైట్లు కాలిపోయాయి. అలాగే బట్టలతో సహా అన్నీ కాలిపోయాయి. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోవడంతో బాధిత కుటుంబం ఆవేదన చెందుతోంది.

25 లీటర్ల సారా పట్టివేత



తహసీల్దార్ కార్యాలయం వద్ద అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

సీతంపేట: మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్ద 25 లీటర్ల సారా అక్రమరవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు దోనుబాయి ఎస్సై మస్తాన్ తెలిపారు. వీరఘట్టానికి చెందిన శివయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్..

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతినదిలో అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఆర్‌డీఓ జేవీవీఎస్ రామ్మోహనారావు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ యజమానికి రూ.10వేల జరిమానా విధించామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు.

లారీని ఢీకొని ఇద్దరికి గాయాలు

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం వద్ద సోమవారం ఇద్దరు యువకులు గాయపడ్డారు. మెరకముడిదాం మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన స్వామి, వాసులు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్తుండగా అచ్యుతాపురం వద్ద విజయనగరం నుంచి వస్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తలపై గాయాలయ్యాయి. గుర్ల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రెడ్డి ల్యాబ్స్ ఉద్యోగిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన భారతి

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పడాలపేటలో ఉంటున్న నడిపేన భారతి, పూసపాటిరేగ వద్ద గల రెడ్డి ల్యాబ్స్‌లో పని చేస్తోంది. వృత్తిలో పర్మినెంట్ కాలేదని కొన్ని రోజుల క్రితం ఆమె కన్నతల్లికి చెప్పింది. చేస్తున్న పనిలో ఒత్తిడి కూడా అధికం అవడం, తల్లికి భారమవుతున్నానన్న బాధతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించి డ్యూటీ నుంచి రాగానే ఇంట్లోని తన గదిలో తలుపేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఈ మేరకు భారతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి



ఫిర్యాదు దారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకితా సురానా

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 63 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు అర్జీదారు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, పునఃపరిశీలన లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 32 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 32 వినతులు వచ్చాయి. జమ్మడుగూడ గ్రామానికి చెందిన సవర కళ్యాణ్ రహదారి మంజూరు చేయాలన్నారు. చిన్నపొల్లకు చెందిన శ్రీలత కుట్టుమిషన్ ఇప్పించాలని కోరారు. మామిడి, జీడి మొక్కలు పంపిణీ చేయాలని కురసింగి గ్రామస్తులు వినతి ఇచ్చారు. కోడిశ గ్రామస్తుడు హెచ్.రవి వన్‌బి అడంగల్ ఇప్పించాలన్నారు. ట్రాక్టర్ లోన్ మంజూరు చేయాలని పద్మాపురం గ్రామస్తుడు మనోసింగు కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్.వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అందిన విజ్ఞప్తులలో కొన్ని..

- ముత్యాల సెంటర్ నుంచి కొత్తం గ్రామం వరకు మెయిన్ రోడ్డు మంజూరు చేయాలని సీతంపేట మండలం కొత్తం గ్రామానికి చెందిన సవర.గంగయ్య అర్జీ అందజేశారు.
- వీరఘట్టం మండలం అడారు గ్రామానికి చెందిన సీహెచ్. దుర్గమ్మ ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తూ 2022 జూలైలో పదవీ విరమణ పొందియున్నానని, ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఏమీ అందలేదని, బెనిఫిట్స్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- పార్వతీపురం మండలం గడబవలస గ్రామానికి చెందిన కె. జగన్నాథం జీవన ఉపాధికోసం ట్రాక్టర్ కొనడానికి ప్రభుత్వం రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- సాలూరు మండలం మావుడి గ్రామానికి చెందిన సీహెచ్ అశోక్(ఎస్టీ కొండదొర) కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పీ.వీర్రాజు, డ్వామా పీడీ కె. రామచంద్రరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, ఉద్యానవనశాఖ అధికారి బి.శ్యామల, పశుసంవర్ధక శాఖ అధికారి డా.ఎస్.మన్మథరావు, డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.సుధారాణి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఉత్తర్వుల మేరకు పార్వతీపురం ఏఎస్పీ అంకితా సురానా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నాలుగు ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం సమస్యలను సంబంధింత పరిధిలో ఉన్న స్టేషన్ అధికారులకు అప్పగించి వాటిని దర్యాప్తు చేసి తక్షణ చర్యలు చేపట్టి జిల్లా పోలీసుశాఖ కార్యాలయానికి నివేదికను పంపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వినతులకు సత్వర పరిష్కారం చూపాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్ తదితర అధికారులు

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు వాటిని అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా వినతులు పరిష్కరించేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని పద్ధతులను పాటిస్తూ వాటిని పరిష్కరిస్తున్నారా? లేదా? అనే అంశంపై వినతుల ఆడిట్ పూర్తి చేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో అందిన వినతుల పరిష్కారంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతుల స్వీకరణ కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ తదితరులు 143 వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతలు బాధితుల నుంచి 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు పరిశీలించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7 రోజుల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.



డీపీఓలో పీజీఆర్ఎస్లో ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీలు

నేటి నుంచి గ్రామస్థాయి యోగా శిక్షణ

• జాయింట్ కలెక్టర్ డాక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి యోగా శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని దీనికి ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులకు జేసీ పలు సూచనలు చేశారు. ప్రతి సచివాలయానికి 9 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశామని, వారి ద్వారా 3వ తేదీ నుంచి ఒక్కో బ్యాచ్‌కు 70 మంది చొప్పున 3 రోజుల యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. దీని కోసం ఎంపిక ఎంపిక చేసిన ప్రదేశాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మాత్రమే యోగా శిక్షకులుగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఇలా జూన్ 14 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ జరుగుతుందని గ్రామంలోని దాదాపు అందరికీ యోగా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు.



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

ఐదుగురు గంజాయి నిందితుల అరెస్ట్

డెంకాడ: డెంకాడ మండలం బెల్లాం గ్రామం దగ్గరలో గల భాష్యం లే-అవుట్లో కొంతమంది వ్యక్తులు గంజాయి వినియోగిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో డెంకాడ ఎస్సై ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, యాంటీ గంజాయి టీమ్ జూన్ 2న దాడులు నిర్వహించి, గంజాయి పీలుస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న ఒక జువైనల్ సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అరెస్టయిన వారి నుంచి 1.330కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, రూ.200 నగదును డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో ఎ-1 జామి మండలం అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ (24) గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. అదేవిధంగా డెంకాడ మండలం బెల్లాం గ్రామానికి చెందిన జుతిక శ్యామ్ (ఎ-2, 19 సంలు) మాల్లపురెడ్డి రాకేష్ (ఎ-3) దిబ్బగుడ్డి గ్రామానికి చెందిన మల్లపురెడ్డి వేణు (ఎ-4) సహా జువైనల్(5) గంజాయి పీలుస్తున్నట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ వివరించారు. గంజాయి విక్రయాలు జరిపిన వ్యక్తితో సహా, గంజాయి వినియోగిస్తున్న మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.



పట్టుబడిన నిందితులతో ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది

బండెమ్మ తల్లి హుండీల చోరీ



బండెమ్మ ఆలయంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

శృంగవరపుకోట: పద్నాలుగు ఏళ్ల తర్వాత ఎస్.కోట మండలంలోని సీతంపేట గ్రామంలో వేడుకగా జరిగిన జరిగిన బండెమ్మ తల్లి పండగ భక్తుల్లో కొత్త ఉత్సాహం నింపినా, వారి మనోభావాల్ని మాత్రం దొంగలు దెబ్బకొట్టారు. ఆదివారం రాత్రి అమ్మవారి అనుపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి 12గంటల వరకూ అమ్మవారి ఆలయం వద్ద సందడిగానే ఉంది. రాత్రి 12గంటల సమయంలో అనువంశిక అర్చకులు, పెద్దలు అమ్మవారికి చెల్లించాల్సిన కానుకలు, ముడుపులు చెల్లించి ఇళ్లకు వెళ్లారు. అమ్మవారి ఆలయం వద్ద సందడి సద్దుమణగగానే దొంగలు పక్కాగా ప్లాన్ అమలు చేశారు. రాత్రి 12గంటల తర్వాత ఆలయంలో ఉన్న స్టీల్, ఐరన్ హుండీలను ఎత్తుకుపోయారు. స్టీల్ హుండీ పగలగొట్టి పక్కన ఉన్న పశువుల పాకలో పడేశారు. ఇనుప హుండీని మాత్రం పట్టుకుపోయారు. 14 ఏళ్ల తర్వాత పండుగ జరగడంతో అమ్మవారికి ఆదాయం దండిగానే వచ్చింది. సుమారు లక్ష రూపాయలు చోరీకి గురైఉంటాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. చోరీ విషయం తెలుసుకున్న ఎస్.కోట పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామంటూ ఎస్.కోట పోలీసులు చెబుతున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



పార్వతీపురం రూరల్: మండలంలోని చిన్నమరికి గడబవలస గ్రామాల మధ్యలో ఉన్న మలుపు వద్ద సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో జియ్యమ్మవలస మండలం బసంగి గడబవలసకు చెందిన చాట్ల సింహాచలం (33) మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



చినమరికి గడబవలస మధ్యలో ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం, (ఇన్‌సెట్లో) మృతుడు చెట్లా సింహాచలం (ఫైల్)

జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 30 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరిగిన 9వ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది క్రీడాకారులు రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, 5 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో కొల్లు హిమశ్రీ, ఎస్.ఉదయ్‌వరుణ్‌లు బంగారు పతకాలు సాధించగా.. ఎం.శ్రీరామ్‌నాయుడు రజత పతకం దక్కించుకున్నాడు. అదేవిధంగా సోము శ్యామ్‌కుమార్, ఎస్.శ్యామ్‌శ్రీవర్ధన్, బి.సాయిచైతన్య, ఎ.గగన్‌దీప్, కె.శ్రీనివాసరావులు కాంస్య పతకాలు దక్కించుకున్న వారిలో ఉన్నారు. పతకాలు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్, జిల్లా అసోసియేషన్ సభ్యులు పిల్లా శ్రీనివాస్, ఎస్.సతీష్‌కుమార్, టి.మురళీకృష్ణ, టి.వెంకటేష్ తదితరులు అభినందించారు.



జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

యోగాంధ్ర అర్బన్ లెవెల్ పోటీలు



పోటీల్లో భాగంగా యోగాసనాలు వేస్తున్న బాలలు

విజయనగరం: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర 2025 అర్బన్ స్థాయి పోటీలను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక రాజీవ్ స్టేడియంలో యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్‌కు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు అర్బన్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఈనెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అర్బన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, పీడీలు, పీఈటీలు, యోగా శిక్షకులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

375 గ్రాముల గంజాయి స్వాధీనం

• ఇద్దరి అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు గంజాయి విక్రయదారులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని పెద్ద చెరువు రామానాయుడు రోడ్డులో కొంతమంది వ్యక్తులు గంజాయి పీలుస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఉడాకాలనీకి చెందిన వజ్జల భరత్ కుమార్, లంకాపట్నానికి చెందిన చిన్న మనోహర్‌లు గంజాయి పీలుస్తూ, విక్రయాలకు పాల్పడుతుండగా పట్టుకున్నారు.వారి దగ్గర నుంచి 375 గ్రాముల గంజాయి, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గంజాయిని చిన్న మొత్తాల్లో విక్రయిస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ చెప్పారు.

అల్లంత దూరాన..!

చద్దన్నం కంటే ఊరగాయ రుచే ఎక్కువైందని వాపోతున్నారు గిరిజనం. ప్రభుత్వం ఫ్రీగా రేషన్ బియ్యం ఇస్తున్నా వాటిని ఇంటికి చేర్చాలంటే కనీసం రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ అందించి మేలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మళ్లీ పాత కష్టాలు పరిచయం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకుల కోసం 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయక తప్పదని ఒక రోజంతా పని మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. రేషన్ సరుకులు పొందడానికి గిరిజనులు పడుతున్న కష్టాలకు అక్షర రూపం.

- రేషన్ బియ్యం ఫ్రీ అయినా..
- ఇంటికి చేర్చేందుకు రూ.100 ఖర్చు
- సరుకులు కావాలంటే 20-25 కిలోమీటర్ల ప్రయాణం
- అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు



ఆటోలో సరుకులు తీసుకు వెళ్తున్న గిరిజనులు



దిగువ మెండంగి డిపోలో రేషన్ కోసం క్యూలో ఉన్న గిరిజన మహిళలు



దిగువ మెండంగిలో రేషన్ సరుకులు కోసం వెళ్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: మండలంలోని దిగువ మెండంగి డిపోలో రేషన్ సరుకుల కోసం డొంకల వెలగవలస, పనసలవలస తదితర గ్రామాల ప్రజలు సోమవారం ఆటోలో వచ్చి సరుకులు తీసుకున్నారు. ఈ సరుకులు తీసుకుని వారి గ్రామానికి చేరాలంటే రూ.100 ఆటో చార్జీ వెచ్చించాల్సిందేనని గిరిజన మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చేది ఫ్రీ బియ్యమే కానీ అవి ఇంటికి చేరాలంటే మాకు వందరూపాయలు ఖర్చు అవుతోందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన రెడ్డి ఇంటింటికీ రేషన్ సరుకులు అందించి పేదలకు ఎంతో మేలు చేశారని ఇంటివద్దే సరుకులు తీసుకుని ప్రశాంతంగా ఉండేవారమని చెబుతున్నారు. కానీ ఇప్పుడు పాత పద్ధతిలోనే రేషన్ సరుకుల కోసం ఒక రోజంతా సమయం కేటాయించడంతో పాటు ప్రయాణానికి చార్జీల రూపంలో ఖర్చులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను కనుమరుగు చేసే క్రమంలో ఇంటింటికీ రేషన్ ఇచ్చే వాహనాలతో పాటు ఎండీయూ ఆపరేటర్లను తొలగించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఇంటింటి రేషన్ పంపిణీ నిలిపివేయడంతో ఏజెన్సీలోని గిరిశిఖర గ్రామాల ప్రజలు డిపోల నుంచి రేషన్ తెచ్చుకోవాలంటే 20-25 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీతో ఎంతో మేలు జరిగిందనుకున్న తరుణంలో మళ్లీ కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే రేషన్ డిపోలో క్యూలో నిలబడి రేషన్ సరుకులు అందుకునే విధంగా చర్యలు తీసుకోవడంపై ముఖ్యంగా గిరిజనులు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. కొదమ పంచాయతీలోని 13 గ్రామాల ప్రజలు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద గ్రామంలో రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. కొఠియా, గంజాయిభద్ర పంచాయతీల ప్రజలు నేరెళ్ల వలస డిపోకు 15 కిలోమీటర్లు కొండ దిగి వస్తున్నారు. అలాగే డెన్సరాయి సంపంగిపాడు పంచాయతీలకు చెందిన 10 గ్రామాల ప్రజలు కురుకుట్టి రేషన్ డిపోకు చేరుకోడానికి 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. జిల్లేడు వలస పంచాయతీ ప్రజలు దండిగాం డిపోకు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కరడవలస పంచాయతీ గిరిజనులు ఏకంగా 40 కిలోమీటర్లు ప్రయాణించడంతో పాటు రెండు వైపులా రూ.300 చార్జీలు రూపంలో వెచ్చించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామాల ప్రజలకు డిపోలలో సరుకులు తీసుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు.

ఏజెన్సీ వాసులకు మళ్లీ పాతకష్టాలే



మండలంలోని ఏజెన్సీ వాసులకు ఎండీయూ వాహనాల రద్దుతో మళ్లీ రేషన్ తీసుకోడానికి డిపోలకు వెళ్లాలంటే డబ్బుల ఖర్చుతో పాటు రోజంతా సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గిరిజనులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని మరిన్ని ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదు. ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎం.బీసు గంజాయిభద్ర గ్రామం